సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్

శామీర్‌పేట్ : సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ అన్నారు. దేవరయాంజాల్‌కు చెందిన గోపాల్‌కు రూ. 32,500, బాబాగూడకు చెందిన బల్వంత్‌రెడ్డికి రూ.43 వేల చెక్కులను ఆయన ఆదివారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు నర్సింహరెడ్డి, మాజీ కౌన్సిలర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైనికుల క్షేమానికి ప్రత్యేక పూజలు



స్వామివారికి అభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: పాకిస్తాన్‌పై పోరాటం చేస్తున్న సైనికుల క్షేమం కోసం మేడ్చల్‌లో ఆదివారం బీజేపీ నేతలు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని రామలింగేశ్వర ఆలయంలో బీజేపీ నేతలు స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు శైలజ, జగన్‌గౌడ్, అర్జున్, లక్ష్మణ్, ప్రేమ్‌దాస్, శ్రీకాంత్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై పెయింటర్ మృతి



పరుశురాం మృతదేహం

జవహర్‌నగర్: మద్యానికి బానిసై పెయింటర్ మృతిచెందిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేడ్కర్‌నగర్‌లో నివసించే చింతల పరుశురాం పెయింటింగ్ పని చేస్తూ.. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నారు. కాగా గత కొంతకాలంగా మద్యానికి బానిసైన అతడు భార్యతో తరచూ గొడవ పడుతుండేవాడు. ఇటీవల భార్య పిల్లలతో కలిసి వరంగల్‌లోని తల్లిదండ్రులు ఇంటికి వెళ్లింది. ఈనెల 10న అంబేడ్కర్‌నగర్‌లోని ఓ వైన్స్‌లో అధికంగా మద్యం సేవించి కిందపడి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూసేసరికి పరుశురాం మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాతృదినోత్సవం.. ప్రత్యేక సేవలు



మచ్చ బొల్లారంలో దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: తల్లి ప్రత్యక్ష దైవమని, అమ్మకోసం అరుంధతి ఆస్పత్రిలో ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మచ్చ బొల్లారం డివిజన్ హనుమాన్ టెక్డీ వద్ద శంకర శశాంక చారిటబుల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పలువురికి చీరలు, మిఠాయిలు పంపిణీ చేశారు. తన తల్లి అరుంధతి కోరిక మేరకు అరుంధతి ఆసుపత్రిని ఏర్పాటు చేసి రోజూ వందలాది మందికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ట్రస్ట్ చైర్మన్ రజని, డాక్టర్ శ్రీనివాస్, సౌమ్య, బీఆర్‌ఎస్ నేతలు డోలి రమేష్, పవన్, మల్లికార్జున్, స్థానికులు బీఎస్. శ్రీనివాసరావు, బాలరాజు, స్వరూపారాణి, సురేష్, శివశంకర్, దేవేందర్, అరుణ్ తదితరులున్నారు.

మాతృ దినోత్సవ వేడుకలు

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మాతృ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ.. ఈ సృష్టికి ఆరంభం అమ్మ అని, మాతృమూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు.

బస్తీ సమావేశ వేదిక ప్రారంభం

మల్లాపూర్: డివిజన్ ఎస్సీకాలనీలో బస్తీవాసుల కోరిక మేరకు జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్‌కుమార్ ఆదివారం బస్తీ సమావేశ వేదికను ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మల్లాపూర్ ఎస్సీసెల్ అధ్యక్షుడు మనోహర్, బస్తీవాసులు, అసోసియేషన్ వాసులు పాల్గొన్నారు.

మారని జీవితం !



అనారోగ్యంతో కరిగిపోతున్న కార్మికుల జీవితాలు

- నామమాత్రపు వేతనాలతో సతమతం
- దుర్భర జీవితం గడుపుతున్న మున్సిపల్ సిబ్బంది
- కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్

జవహర్‌నగర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికులు దుర్భర జీవితాలను గడుపుతున్నారు. చిన్న వయస్సులోనే పారిశుద్ధ్య కార్మికులు జబ్బు భారినపడి ఆసుపత్రి పాలవుతున్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండేందుకు రోజూ కష్టపడుతున్నా.. పట్టించుకునేవారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీవో 212 ప్రకారం సౌకర్యాలు..

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 130 మంది కార్మికులు పనిచేస్తున్నారు. కాగా గ్రామపంచాయితీ ఏర్పడినప్పటి నుంచి పనిచేస్తున్న సిబ్బందికి మారుతున్న కాలాన్ని బట్టి రోజువారి వేతనం పెరగడానికి చాలా ఏళ్లు పట్టింది. పారిశుద్ధ్య సిబ్బందికి కనీసవేతనాలు చెల్లించాలని జీవో నెం.212 ప్రకారం ఈఎస్‌ఐ, పీఎఫ్ కల్పించాలని అనేక ఏళ్లుగా కార్మిక నాయకులు పోరాటాలు చేస్తూనే ఉన్నారు. 2008 డిసెంబర్ నెలలో కాంట్రాక్ట్ కార్మికులకు పాత జీవోను చట్టం చేస్తూ.. కొత్త జీవో ప్రకారం నెలవారీ జీతంతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించారు. బ్యాంకుల ద్వారా జీతాలు ఇవ్వాలని, అది నేటికి అమలు కావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తాజాగా జీవో 65 అమలు..

గత ప్రభుత్వం జీవో 14 ప్రకారం అమలు చేయగా.. ప్రస్తుత ప్రభుత్వం జీవో 65ను అమలు చేస్తోంది. జీవోనెం 60 ప్రకారం వేతనాలు పెంచి, గతంలో కార్మికులకు పెంచిన జీతాలను తగ్గించకుండా వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



జవహర్‌నగర్ ప్రధాన రహదారి పక్కన చెత్తను తొలగిస్తున్న కార్మికులు (ఫైల్)

అనారోగ్య సమస్యలు..

పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారి కుటుంబాల్లో రోజూ ఎవరో ఒకరూ అనారోగ్యంతో బాధపడుతున్నారు. శ్వాసకోస వ్యాధులు, ఇన్‌ఫెక్షన్‌కు గురై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కార్మికుల జీవితాలకు సరైన భద్రత లేకుండా పోయిందనే విమర్శలున్నాయి.

సగానికి పైగా 25 ఏళ్ల సర్వీసు..

జవహర్‌నగర్ పట్టణంలో పనిచేస్తున్న 130 మంది కార్మికుల్లో సగానికి పైగా 25 ఏళ్ల సర్వీసు ఉన్నవారే. అందరికీ నిర్దిష్ట పని గంటలు ఉన్నా.. వీరికి వర్తించవు. ఇంతచేసినా.. వీరికి ఇచ్చే వేతనం నామమాత్రమే. కాలానికి అనుగుణంగా కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవడం లేదు. పారిశుద్ధ్య కార్మికులు అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు పట్టణ కార్పొరేషన్ ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

ఉద్యోగ భద్రత కరువు ..

కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. ఐదేళ్లపాటు పనిచేసిన వారికి ఉద్యోగ భద్రత కల్పించాలనే నిబంధన ఉంది. అయితే స్థానిక సంస్థలకు పూర్తిస్థాయిలో అధికారాలు ఇవ్వకపోవడం వల్ల ఆ నిబంధన అమలుకు నోచుకోవడం లేదు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు రోజూ అడుగుతున్నప్పటికీ వారిని పట్టించుకునే వారు లేకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలి. జీవిత భీమాను వెంటనే అమలు చేయాలి. తెలంగాణ వస్తే మా ఉద్యోగాలు పర్మనెంట్ అవుతాయని అనుకున్నాం. కానీ నేటికి ప్రభుత్వం అమలు చేయడంలేదు. ప్రతీ కార్మికుడికి రూ.26 వేల కనీసం వేతనం చెల్లించాలి.

– రాములు, ఎలక్ట్రిషన్, జవహర్‌నగర్

హెల్త్‌కార్డులు ఇవ్వాలి



నిత్యం పారిశుద్ధ్య పనులు చేసుకుంటూ రోగాలభారిన పడుతున్నాం. కనీస వేతనం లేక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికులకు హెల్త్‌కార్డులు ఇచ్చి, ఉచిత వైద్యం అందించాలి.

– వెంకటమ్మ, పారిశుద్ధ్య కార్మికురాలు

సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటమే..



ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెలబెట్టుకుని కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి. కార్పొరేషన్‌లో కాంట్రాక్టు విధానాన్ని రద్దుచేసి పర్మనెంట్ చేయాలి. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలి. కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటాలను ఆపేదిలేదు.

– శివబాబు, రాష్ట్ర మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

మేడ్చల్: రేపు మేడ్చల్‌లో నిర్వహించే పాలిసెట్‌కు అంతా సిద్ధం చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 13న పాలిసెట్ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మేడ్చల్‌లోని గిర్మాపూర్ పాలిటెక్నిక్ కళాశాల, స్ఫూర్తి, ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల, హైటెక్, హైటెక్ మోడ్రన్, ఎస్ఎస్‌జీ, ఆక్స్‌ఫర్డ్, ఢిల్లీ వరల్డ్ పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్ష ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఉంటుందని ప్రిన్సిపాల్ అరుంధతి ప్రకటించారు.

సోషల్ మీడియాలో యుద్ధం వీడియోలు పోస్ట్ చేయొద్దు !



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

కీసర: కీసర పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రగ్స్ నివారణకు ప్రజలందరూ సహకరించాలని, గంజాయి విక్రయించే వ్యక్తుల సమాచారం పోలీసులకు తెలపాలన్నారు. భారత్–పాక్ యుద్ధం నేపథ్యంలో సోషల్ మీడియాలో యుద్ధానికి సంబంధించిన వీడియోలు, మతపరంగా విద్వేషాలు వచ్చే వీడియోలు, పోస్టులు చేయకూడదని సూచించారు. అదే విధంగా ర్యాలీలు నిర్వహించొద్దని తెలిపారు. ఎస్సైలు వెంకటేష్, లక్ష్మణ్, నాగరాజు, వివిధ పార్టీల నాయకులు తదితరులున్నారు.

ఏపీ ప్రభుత్వ తీరుపై జర్నలిస్టులు, ప్రజా సంఘాల నిరసన



జవహర్‌నగర్‌లో అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల వద్ద ప్రజాసంఘాల నేతలు, జర్నలిస్టుల నిరసన

జవహర్‌నగర్: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తోందని పలు జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల నేతలు ఆరోపించారు. నిజాలను నిర్భయంగా రాస్తున్న జర్నలిస్టులపై దాడులకు పాల్పడడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. కేసుల పేరుతో వేధించడం దారుణమన్నారు. సాక్షి దినపత్రిక సంపాదకుడు ఆర్.ధనంజయరెడ్డి నివాసంలో ఎలాంటి అనుమతులు, నోటీసులు లేకుండా సోదాల పేరుతో దౌర్జన్యానికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో జర్నలిస్టులు, ప్రజాసంఘాల నేతృత్వంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేడ్కర్, జగ్జీవన్‌రాంల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను కాలరాస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు శివబాబు, క్రాంతి కళాబృందం అధ్యక్షుడు వెంకటచారి, జంగిడి శ్రీనివాస్, మహనీయుల ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మొగిలిపాక పరశురాం, మేడ్చల్ నియోజకవర్గ జర్నలిస్టులు మండల మురళీధర్, సత్యనారాయణ, అంజిరెడ్డి, సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, భూపాల్, జవహర్‌నగర్ జర్నలిస్టులు నర్సింహయాదవ్, నాగరాజు, శ్రీధర్, తూటి శ్రీనివాస్, పోరండ్ల యాదగిరి, లక్ష్మణ్, దేవేందర్, శ్రీనివాస్, వెంకటక్రిష్ణ,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కట్టమైసమ్మ బోనాలు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని పూడూర్‌లో కట్టమైసమ్మ బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూడేళ్లకోసారి గ్రామదేవతల పండగను గ్రామంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం గ్రామంలో కట్టమైసమ్మ ఆలయంలో మహిళలు, గ్రామస్తులు బోనాల పండగను నిర్వహించారు. ఈనెల 15 వరకు గ్రామంలో గ్రామదేవతల జాతరను నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు ప్రకటించారు. గ్రామస్తులందరూ బోనాల పండుగను నిర్వహించడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

రూ.17 లక్షలతో అభివృద్ధి పనులు



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్

బోడుప్పల్: డివిజన్ పరిధిలో రోడ్ల అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు 1వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్ అన్నారు. క్రాంతి కాలనీలో రూ.17లక్షలతో బీటీరోడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశలవారీగా 1వ డివిజన్‌లో తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యతను ఇచ్చామని, త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.

సమాజ నిర్మాణానికి అంబేడ్కర్ విశేష కృషి



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: సమ సమాజ నిర్మాణానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారని, ఆర్టీసీ చెంగిచెర్ల డిపో కంట్రోలర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, మత, ధనిక, పేద, లింగబేధం లేకుండా పాలకులను ఎన్నుకునే హక్కును అంబేడ్కర్ రాజ్యాంగం కల్పించిందన్నారు. సబ్బండ వర్గాల ప్రజలు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ఎదిగేందుకు మన రాజ్యాంగం రిజర్వేషన్ సౌకర్యం కల్పించిందన్నారు. గ్రే హౌండ్స్ కమాండో అమరుడు తిక్క సందీప్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దాసు, బాల్‌రాజ్, రాజేష్‌కుమార్, నర్సింగ్‌రావు, రాందాసు, ఆంజనేయులు, గణేష్‌గౌడ్, జగదీష్, సురేష్‌గౌడ్, నిఖిల్, విష్ణు, జహీరుద్దీన్, రామేశ్వర్‌రావు, అఖిల్, కృష్ణంరాజు, వెంకటేశ్వర్లు లలిత్ పాల్గొన్నారు.

మంత్రికి ఘనస్వాగతం



కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారంలో జరుగుతున్న ఖైదీల 'స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్' ముగింపు కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో పాటు కాంగ్రెస్ మేడ్చల్, ఉప్పల్ ఇన్‌చార్జ్‌లు వజ్రేష్ యాదవ్, మందముల పరమేశ్వర్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన చర్లపల్లి జైల్ ఖాళీ స్థలంలోని డ్రైనేజీ, స్టామ్‌వాటర్‌లేన్‌ల నిర్మాణం చేపట్టాల్సిన విషయాన్ని మంత్రితో పాటుగా జైళ్లశాఖ అధికారులకు వివరించినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతారాంరెడ్డి, యాదగిరి, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా నృసింహ స్వామి కల్యాణం



చీర్యాలలో స్వామివారి కల్యాణోత్సవం

కీసర: లక్ష్మీనృసింహస్వామి జన్మదినోత్సవం సందర్భంగా చీర్యాలలోని శ్రీలక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. ఆదివారం ఉదయం స్వామివారికి తులసిపూజ, సుదర్శన హోమం, హారతి, పూజల అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం భక్తులచే అన్నప్రసాద వితరణను చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున స్వామివారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి, తదితరులున్నారు.

చర్లపల్లి డివిజన్ సమస్యలపై..

జైళ్లశాఖ డీజీపీని కలిసిన ఎమ్మెల్యే బండారి



కాలనీల సంక్షేమ ప్రతినిధులతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌కు చెందిన పలు కాలనీల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, స్టామ్‌వాటర్‌లేన్‌ల నిర్మాణ విషయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలంగాణ జైళ్లశాఖ డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రాను కలిశారు. చర్లపల్లి ఓపెన్ జైల్‌కు ఆనుకుని ఉన్న రెడ్డికాలనీ, భగవాన్‌కాలనీ, కృష్ణనగర్ కాలనీ, ఎంఆర్‌ఆర్ కాలనీలకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదన్నారు. వర్షాకాలంలో వరద నీరు బయటకు వెళ్లడంతో కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమీపంలోని జైలు స్థలంలో నుంచి డ్రైనేజీ, స్టామ్‌వాటర్ లేన్‌ల నిర్మాణాలు చేపట్టడమే ఈ సమస్యకు పరిష్కారమని భావించిన జైళ్లశాఖ అధికారులను సంప్రదించినట్లు పేర్కొన్నారు. గతంలోనే ఈ విషయాన్ని హోంశాఖ స్పెషల్ సెక్రటరీ రవిగుప్తాను కలిసి వివరించామన్నారు. తాజాగా ఆదివారం చర్లపల్లి జైల్‌లో జరిగే కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన డీజీపీని కలిసి సమస్యను వివరించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీనిపై డీజీపీ ఆయా కాలనీలను సందర్శించి సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ నేతలు మహేష్‌గౌడ్, గిరిబాబు, నర్సింహ్మ, ఆనంద్‌రాజ్‌గౌడ్ ఆయా కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: మాతృదినోత్సవం సందర్భంగా మినీ శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సైని నృత్యాల గురువు నేహాసింగ్ ఆధ్వర్యంలో కళాకారులు శృతికిరణ్, అనన్య, స్వీకృతి, జోషిత, హిరణ్మయి, లోహిత, మహతి, హంసిని, విశాఖ, శ్రీనిధి, శృతి తదితరుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కల్యాణం.. కమనీయం !

వైభవంగా లక్ష్మీనృసింహ స్వామి కల్యాణోత్సవం



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సునీత

ఉప్పల్: బీరప్పగడ్డ తేనే లక్ష్మీనృసింహ స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామివారి కల్యాణోత్సవానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపు ఆనంద్, కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు నాగరాజు, పిట్టల శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, గోవిందకుమార్, జగన్, కొండల్‌రావు, సతీష్ తదితరులున్నారు.

గౌతంనగర్ : డివిజన్ పరిధిలోని జయగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి జన్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక హోమాలు అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్, టీటీడీ దేవస్థానం స్థానిక కమిటీ సభ్యులు రమణారెడ్డి, దేవాలయ ఈఓ రమాదేవి, చైర్మన్ బాలరాజుయాదవ్, నాయకులు మేకల రాముయాదవ్, కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, జేఏసీ వెంకన్న, నర్సింగ్‌రావు, కిట్టు, నర్సింగ్, మల్లేష్, రాజా, ఏపీ.ప్రసాద్, సుధాకర్, రాజేష్, సత్యనారాయణ, ఆలయ అర్చకులు రఘుకిరణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



బీరప్పగడ్డ తేనే లక్ష్మీనృసింహ స్వామి కల్యాణోత్సవంలో భక్తులు



శ్రీవారి కల్యాణం..

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో శ్రీవారి కల్యాణం ప్రధాన అర్చకులు ముదుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసీరమణాచార్యులు ఘనంగా నిర్వహించారు. ప్రతినెలా రెండో ఆదివారం లోక కల్యాణార్థం స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని, ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. క్లర్క్ సుధాకర్, అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



జన్మోత్సవాల్లో కాంగ్రెస్ నాయకులు